క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ నేటి వరకు పొడిగింపు

తోట్లవల్లూరు: పింఛన్ల పంపిణీని శనివారం వరకు పొడిగించినట్లు ఎంపీడీఓ కేఏఎస్ రవి కాంత్ శుక్రవారం తెలిపారు. అమరావతిలో ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమం నేపథ్యంలో పింఛన్ల పంపిణీని శనివారం వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా సెర్ప్ అధికారులు ఆదేశించారని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవికాంత్ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి



కూచిపూడి (మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉపాలయమైన శంకర స్వామి మందిరంలో శుక్రవారం శంకరాచార్యుల జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శంకరమఠం నిర్వాహకులు వేదాంతం రఘురామ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం భక్తులకు మామిడి పండ్లను పంపిణీ చేశారు.

కుల గణనకు ఆమోద ముద్ర హర్షణీయం

కైకలూరు: కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కుల గణనతో బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని, దేశ వ్యాప్తంగా జనాభా లెక్కలు కులాల వారీగా లెక్కించనుండటం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగునేని వరప్రసాద్ పేర్కొన్నారు. కైకలూరులో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో కులగణనకు ఆమోద ముద్ర వేయడం అభినందనీయమన్నారు. కుల గణనతో బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా నాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు సుందరయ్య కాలనీలోని శ్రీ నాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలోని పుట్టకు పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్క గ్రామాలైన వానపాముల, చినపారుపూడి, పెదపారుపూడి నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. గ్రామ సర్పంచ్ కె.అనూష తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ అనే కోర్సుకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. రెండు నెలల పాటు కొనసాగే ఈ శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణత, ఆపై చదివిన వారు అర్హులని తెలిపారు. మొత్తం 30 మందికి ఈ శిక్షణకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98488 19682లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



కోనేరుసెంటర్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకుంటామని, మచిలీపట్నం ఎక్సైజ్ ఎం.రామశేషయ్య హెచ్చరించారు. బందరు మండలం పోతేపల్లి గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఇరువురు యువకులను మచిలీపట్నం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రామశేషయ్య మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల మద్యం తాగడం వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గ్రూపులుగా ఏర్పడి మద్యం తాగే వారిపై చర్య తీసుకోవడంతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్లకు వారిని అప్పగిస్తామని ఆయన హెచ్చరించారు. విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాస చౌదరి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటి వద్దే వైద్య సేవలకు మంగళం..!

- గత ప్రభుత్వంలో ఇంటి వద్దే వైద్య సేవలు
- పథకాన్ని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు



గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

గుడివాడరూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంటి వద్దే వైద్య సేవలందించే పథకానికి ప్రస్తుతం మంగళం పాడారు. దీంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించగలిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇంటింటా వైద్య సేవలను ఏర్పాటు చేశారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందించేవారు. ప్రతి నెలా తమ ఏరియాలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది వచ్చి 14 రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందించేవారు. మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉన్న ఆస్పత్రికి తరలించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ సేవలన్నిటికీ మంగళం పాడింది. దీంతో అనారోగ్యం వస్తే ఆస్పత్రులు చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

పడకేసిన పల్లె వైద్యం

నెల నుంచి ఎండలు పెరగడంతో పాటు వడదెబ్బతో పలు వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, దోమలు బెడద అధికమైన నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు వాంతులు, విరోచనాలు, జ్వరాలు వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. ఆస్పత్రులకు రాలేని వారి పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించేవారు. గుండె సంబంధిత వ్యాధి రోగులకు ఈసీజీ తీసేవారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి నాణ్యమైన వైద్య సేవలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది.

గతంలో ఇంటి వద్దే వైద్య పరీక్షలు

గత వైఎస్సార్ సీపీ పాలనలో నెలకోసారి వైద్య సిబ్బంది ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించేవారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు ఇచ్చేవారు. గత కొన్ని నెలలుగా వైద్య సేవల గురించి పట్టించుకున్నవారే లేరు.

– కె.అశోక్, తటివర్రు

ఇబ్బందులు పడుతున్నాం



గతంలో ఇంటికి వచ్చి వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించి మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

– అన్నపూర్ణ, మల్లాయపాలెం

రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేకం



రేణుకా పరమేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

పామర్రు: అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైశాఖ మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను చేశారు. తొలుత స్వామికి ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలను చేశారు. శ్రీసూక్త నవగ్రహ దేవి శాంతి హోమాలను దాత విజయవాడకు చెందిన నెక్కంటి విశ్వనాథం సుధారాణి దంపతులతో స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, ఎంపేరయ్య, రమేష్, దుర్గాప్రసాద్ , చెన్నారాయుడు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు చందనోత్సవం



చందనంతో అలంకరించిన అమ్మవారు

గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్ నాగవరప్పాడులో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో చందనోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని చందనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పవిత్ర వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని చందనోత్సవాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. లోక కల్యాణార్థం దేవస్థానంలో చందనోత్సవ పూజలు నిర్వహించామని పేర్కొన్నారు. చందనోత్సవాలు నిర్వహించడంతో యావత్ ప్రజానీకం సుభిక్షంగా ఉంటుందని ఆలయ పండితులు కె. ఫణీంద్ర ఆచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎంవీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వార్లకోడు డ్రెయిన్ ఆక్రమణలపై సర్వే



డ్రెయిన్‌పై నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ రామకృష్ణ, పంచాయతీ ఈఓ ఆనంద భూషణం

కైకలూరు: భారీ వర్షాల సమయంలో కై కలూరు ముంపుబారిన పడటానికి ప్రధాన కారణమైన వార్లకోడు డ్రెయిన్ ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై అధికారులు కన్నెర్ర చేశారు. డ్రెయిన్ ఆక్రమణలపై పంచాయతీ, రెవెన్యూ, డ్రెయినేజీ శాఖలకు ఫిర్యాదులు అందాయి. దీంతో డ్రెయినేజీ శాఖ ఏఈ రామకృష్ణ, పంచాయతీ ఈఓ ప్రత్తిపాటి ఆనంద భూషణం ఆధ్వర్యంలో మండల సర్వేయర్ రమేష్ సిబ్బందితో భాష్యం స్కూల్ సమీపంలో వైఎస్సార్ నగర్‌కు వెళ్లే దారిలో వార్లకోడు డ్రెయిన్‌ను శుక్రవారం సర్వే చేశారు. ఇటీవల ఇక్కడ ఓ వ్యక్తి ప్రహరీ నిర్మించారు. వార్లకోడు డ్రెయిన్ సమీప రోడ్డును ఆక్రమించి నిర్మించినట్లు సోషల్ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో డ్రెయిన్‌ను సర్వే చేశారు. సర్వేలో రెండు రకాలుగా కొలతలు రావడంతో డ్రెయిన్ ప్రారంభం నుంచి పూర్తి స్థాయిలో మరోసారి సర్వే చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ మాట్లాడుతూ డ్రెయిన్ల ఆక్రమణదారులను గుర్తించి అందరికీ నోటీసులు అందిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అక్రమ కట్టడాల కూల్చివేతలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రంగనాయకమ్మ, పంచాయతీ సిబ్బంది శ్యామలరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి

ముదినేపల్లి రూరల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సింగరాయపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ సుందరమ్మ అన్నారు. సింగరాయపాలెం సచివాలయంలో కిశోర బాలికలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలకు చట్టబద్ధత లేదన్నారు. ఇలాంటి వివాహాల వలన అనారోగ్య సమస్యలతో పాటు పలు అనర్థాలు కలుగుతాయన్నారు. బాల్య వివాహాలకు ఎవరైనా పాల్పడితే అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎంకె రోహిణి, వెల్ఫేర్ అసిస్టెంట్ తేజ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సొసైటీల్లో ఈ–ఆడిట్ ద్వారా పారదర్శకత

జిల్లా సహకార అధికారి చంద్రశేఖరరెడ్డి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఈ–ఆడిట్ ద్వారా పారదర్శకతకు అవకాశం కలుగుతుందని జిల్లా సహకార శాఖ అధికారి కె.చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఈ–ఆడిట్ విధానంపై కేడీసీసీ బ్యాంక్ కేంద్ర కార్యాలయంలో సహకార సంఘాల సీఈవోలు, సహకార శాఖ ఆడిటర్లకు శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 212 సహకార సంఘాల్లో మార్చి 31వ తేదీ నాటికి కంప్యూటరీకరణ పూర్తి చేశామన్నారు. కంప్యూటరీకరణ చేయటం ద్వారా సంఘాల్లోని లావాదేవీలన్నీ కంప్యూటర్ ఆపరేటర్లకు లాగిన్ ఏర్పాటు చేసి ఆ లాగిన్ ద్వారా ఎప్పటికప్పుడు నిర్వహిస్తామన్నారు. ఓచర్లు, రిసిప్ట్‌లు తదితర అంశాలన్నీ కంప్యూటర్ ద్వారా జరుగుతాయని దీనికి సహకార సంఘం సీఈవో లాగిన్ ద్వారా ప్రతిరోజు సంఘ లావాదేవీలను పరిశీలిస్తారన్నారు. ఈ కార్యక్రమాలన్నీ ఈ–ఆడిట్ ద్వారా ఎప్పటికప్పుడు సహకార శాఖలో ఉన్న ఆడిటర్లు వాటిని పర్యవేక్షించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేస్తారన్నారు. ఈ–ఆడిట్ ద్వారా పారదర్శకంగా సంఘ సభ్యులకు లావాదేవీలు నిర్వహించే అవకాశం కలుగుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ ఎ.శ్యామ్‌మనోహర్, మాస్టర్ ట్రైనర్లు కోటేశ్వరరావు, శివశంకర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మొవ్వ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విమాదేవి తెలిపారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బావాజీ మఠం మహంతుగా కౌసలేంద్ర దాస్

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠం మహంతుగా కౌసలేంద్ర దాస్ నియమితులయ్యారు. తిరుపతి హథీరామ్‌జీ మఠానికి చెందిన ముంబయిలోని ఉపమఠం బాధ్యతలు నిర్వహిస్తున్న కౌసలేంద్ర దాస్ బావాజీ మఠం బాధ్యతలు గురువారం చేపట్టారు. గుంటూరుకు చెందిన పీఠాధిపతి మహంత్ హనుమత్ దాస్ పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహంతుగా బాధ్యతలు చేపట్టిన కౌసలేంద్ర దాస్ మాట్లాడుతూ మఠం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు

తోట్లవల్లూరు: స్థానిక యూకో బ్యాంకు వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై దెబ్బతిన్న కల్వర్టుకు అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు నిర్వహించారు. ఇసుక లారీల రవాణా ధాటికి స్థానిక యూకో బ్యాంకు వద్ద కల్వర్టు కొన్ని రోజుల క్రితం దెబ్బతిన్న విషయం విదితమే. కల్వర్టుకు రంధ్రం పడటంతో వాహనదారులు రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను సర్పంచ్ పెనుమత్స రాధిక అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో ఆర్అండ్‌బీ ఏఈఈ మల్లికార్జున శుక్రవారం దెబ్బతిన్న కల్వర్టుకు తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభం

పెడన: పెడన సహాయ ఫౌండేషన్ వారు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని మచిలీపట్నం ఇన్‌చార్జి ఉప విద్యాశాఖాధికారి బీఎస్‌సీ శేఖర్‌సింగ్ అన్నారు. పెడన సహాయ ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ భాషా, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్, మహిళ విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, విద్యా విభాగం చైర్మన్ మట్టా రాధాకృష్ణమూర్తి, రౌతుల ప్రసాద్, తుమ్మల వరప్రసాద్, బట్ట దుర్గాశంకర్, సుమంత్, కంప్యూటర్ మాస్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి నాగపడగ సమర్పణ



స్వామివారికి వెండి నాగపడగను అందజేస్తున్న శివసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి గుంటూరు జిల్లా కొల్లూరు మండలం యాదవపాలెం గ్రామస్తుడు డొక్కు శివసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు సుమారు రూ.65 వేల విలువగల 525 గ్రాముల వెండితో తయారు చేసిన నాగపడగను స్వామివారికి కానుకగా సమర్పించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయానికి చేరుకున్న వారు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం చేయించుకున్నారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావుకు స్వామివారి వెండి నాగపడగను అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారి కిషోర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయండి



పోస్ట్ కార్డుల ద్వారా విజ్ఞప్తి చేసిన నాయకులు, ఉపాధ్యాయులు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం మెమో నంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 2003 డీఎస్సీ రాష్ట్ర ఫోరం ఉద్యమ కార్యాచరణ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర ఫోరం కార్యాచరణలో భాగంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ అధ్యక్షురాలుకు పోస్ట్ కార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ కన్నా ముందు విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా తాము నియమితులయ్యామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పనిచేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం మెమోను అనుసరించి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ కేఎల్ శ్రీనాథ్, సభ్యులు బెనర్జి, జయరాజ్ పాల్గొన్నారు.

జోజప్ప జీవితం ఆదర్శం



ప్రార్థన చేస్తున్న ఫాదర్ మ్యాథ్యూ

గుడ్లవల్లేరు: ఏసు విశ్వాసులతో పాటు అందరూ పునీత కార్మిక జోజప్ప జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని గుడ్లవల్లేరు ఆర్సీఎం చర్చి ఫాదర్ మ్యాథ్యూ అన్నారు. మేడేను పురస్కరించుకుని గురువారం రాత్రి పునీత జోజప్ప మహోత్సవాల్లో భాగంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసును పెంచిన తండ్రి జోజప్ప వడ్రంగి కార్మికుడిగా తన కుటుంబాన్ని నీతివంతంగా పోషించుకుంటూ నిజమైన క్రైస్తవత్వం వైపు జీవన యానం సాగించారన్నారు. సమాజ శ్రేయస్సుకే నిజమైన క్రైస్తవుడు శ్రమించాలని కోరారు. నలుగురు బాగు కోసం తాను కష్టపడితే క్రీస్తు ఆశీర్వచనాలు వారికి ఎల్లవేళలా ఉంటాయని సూచించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఫాదర్ మ్యాథ్యూతో పాటు 20 మంది ఫాదర్లు, తదితర సంఘ పెద్దలు పాల్గొన్నారు.

లూర్ధుమాత ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు



ఉత్సవాలకు హాజరైన సంఘస్తులు

మండవల్లి: మండలంలోని భైరవపట్నంలో విచారణ గురువులు సంకుర్ల శాంతిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన లూర్ధుమాత మహోత్సవాలకు భక్తులు పోటెత్తారు. విచారణ గురువులు జపమాల ధ్యానం, స్తుతి ఆరాధన, సమష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన మరియ తల్లి స్వరూపం సంఘస్తులను ఆకట్టుకుంది.

జాతీయ రహదారి నిర్మాణ పనుల పరిశీలన



నేషనల్ హైవే నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ శరత్, క్వాలిటీ ఇంజినీర్ భానుప్రసాద్

మండవల్లి: నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్నామని నేషనల్ హైవే ఏఈ శరత్ పేర్కొన్నారు. మండవల్లిలోని 165 జాతీయ రహదారి నిర్మాణ పనులను ఆయన క్వాలిటీ ఇంజనీర్ భానుప్రసాద్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. గత కాంట్రాక్టర్ జాప్యం, అలసత్వం వలన నిర్మాణ పనులు ఆలస్యం అయ్యాయన్నారు. పనులను వేరొక కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం అప్పగించడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.

5న మండల కేంద్రాల్లో ధర్నాలు

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకుల వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు, పవన్‌కుమార్

మచిలీపట్నంటౌన్: ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 5వ తేదీన జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శీలం నారాయణరావు, పి.పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జ్యోతీరావు పూలే భవన్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ ధర్నా కార్యక్రమాలకు పిలుపునిచ్చామన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని, చట్ట ప్రకారం 100 రోజుల పని కల్పించాలని, లేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త కార్మికులకు వెంటనే జాబ్ కార్డులు ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న భార్యాభర్తలకు విడివిడిగా జాబ్‌కార్డులు ఇవ్వాలని వారు కోరారు. కార్మికులకు పలుగు, పార ఇతర పని సామగ్రి, వేసవి అలవెన్స్ 40 శాతం కలిపి ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లతో చేపడుతున్న ధర్నాను ఉపాధి హామీ కార్మికులు పాల్గొని జయప్రదం చేసి డిమాండ్‌లను సాధించుకోవాలని వారు కోరారు.

లోతు దుక్కులపై అవగాహన



కప్తానుపాలెంలో లోతు దుక్కులపై అవగాహన కల్పిస్తున్న సమన్వయకర్త డాక్టర్ సుధారాణి

కప్తానుపాలెం(మోపిదేవి): లోతు దుక్కులు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తల సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. మండలంలోని పెదప్రోలు శివారు కప్తానుపాలెంలో శుక్రవారం బాపట్ల కళాశాల విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ వేసవికాలంలో చేపట్టాల్సిన లోతు దుక్కులు, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. లోతు దుక్కుల వల్ల భూసారం పెరిగి నేలలో తేమ నిలుపుకొనే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ఎస్ఎంఎస్ పంట ఉత్పత్తి డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ పద్ధతులను క్షేత్ర ప్రదర్శన ద్వారా చేసి రైతులు, విద్యార్థులకు చూపించారు. వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ బి.నవీన్, అభ్యుదయ రైతులు రామకృష్ణ,సురేష్, శ్రీహరి, పిచ్చేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.